క్లుప్తంగా

దేశ కీర్తిని దశదిశలా చాటిన గొప్పవ్యక్తి

మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్



మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుతో మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ (ఫైల్)

హుస్నాబాద్: దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న ఇవ్వడంపై మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పీవీ నర్సింహారావు భారత దేశ కీర్తి ప్రతిష్ఠలను ఉన్నత స్థాయికి చేర్చారన్నారు. ఆయన తీసుకున్న నిర్ణయాల ఫలితంగా నేడు అభివృద్ధి సాధ్యమైందన్నారు. పీవీతో తమకు ఎంతో అనుబంధం ఉందని, ఆయన స్వగ్రామం భీమదేవరపల్లి మండలం వంగర నాడు హుజురాబాద్, నేడు హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉందన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు జయపాల్‌రెడ్డి



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు జయపాల్‌రెడ్డి

గజ్వేల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ రాజీలేని పోరాటాలను కొనసాగిస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర నాయకుడు జయపాల్‌రెడ్డి అన్నారు. పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గజ్వేల్‌లో యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కులను కాపాడటంలో తమ సంఘం ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ గజ్వేల్ మండల అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగం గౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, శివశంకర్, ఎంఎస్‌ఓ కృష్ణ, గెజిటెడ్ హెచ్‌ఎం బస్వరాజ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



చెత్తపై అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక అధికారిణి సరోజన

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి సరోజ శుక్రవారం పరిశీలించారు. గాంధీనగర్‌లో ప్రజలతో కలిసి ఇంటింటికి తిరిగి మహాలక్ష్మి పథకంలోని గ్యాస్ పథకం సర్వే తీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇండ్లలోని నిల్వ నీటిని తొలగించాలన్నారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని చెప్పారు. ఇంట్లో చెత్తను రోడ్డుపై వేయకుండా ఇంటి ముందుకు వచ్చే చెత్త బండిలో వేయాలని సూచించారు. ఆమె వెంట కార్యదర్శి హారిక తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి



మండల వనరుల కేంద్ర సిబ్బందితో మాట్లాడుతున్న సంఘ నాయకులు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆల్ఫోర్స్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తూ అకారణంగా విద్యార్థులను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని ఆరోపించారు. పాఠశాల విద్యా హక్కు చట్టం ప్రకారం ఎలాంటి నిబంధనలు పాటించడం లేదని, అర్హత లేని టీచర్లతో విద్యా బోధన చేయిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవని, సరిగా చదవడం లేదని ఓ విద్యార్థినిని టీచర్ కొట్టారని అడగటానికి వెళితే సంబంధం లేని వ్యక్తులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, నాయకులు శేఖర్, నమ్మయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఆర్డీఓకు ఫిర్యాదు



గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ యాదగిరి, గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ భూములు కాపాడటంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండలంలోని ఖమ్మంపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఎంపీటీసీ యాదగిరితో కలిసి గ్రామస్తులు గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మంపల్లి గ్రామ శివారులో సర్వేనంబర్ 1060, 1061లో 130 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 60 ఎకరాల భూమిని పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసింది. గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీ అవసరాలకు, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాల కోసం పది ఎకరాల భూమిని కేటాయిస్తూ హద్దులు చూపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. రెవెన్యూ అధికారులు తూతూ మంత్రంగా సర్వే చేసి హద్దులు చూపకుండా వదిలేశారు. ఈ నేపథ్యంలో ఇదే స్థలంలోని కొంత భూమిని అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డి సిద్దిపేట క్రిస్టియన్ల శ్మశాన వాటికకు కేటాయించినట్లుగా ప్రచారం చేసుకుంటూ భూమిలోకి వచ్చేందుకు కొందరు ప్రయత్నించారు. దీంతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగడంతో వెనక్కి వెళ్లారు. ఈ విషయాన్ని ఇటీవల తహసీల్దార్ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా విచారణ చేసి ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పెట్టాలని ఆర్‌ఐ బాలకిషన్, సర్వేయర్ శేఖర్‌కు సూచించారు. అయితే వాళ్లు నిర్లక్ష్యం చేస్తుండటంతో అనుమానంతో ఎంపీటీసీ, గ్రామస్తులు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. ఇందులోని 30 ఎకరాల వరకు ఆక్రమణకు గురైన విషయాన్ని కూడా ఆర్డీఓకు వివరించారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫోన్‌లో ఆదేశించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్ రెడ్డి, అందే యాదగిరి, రఘురాములు, కనకయ్య, శేఖర్ పాల్గొన్నారు.

వెంకటయ్యది హత్యే

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు మండలం ఘణపూర్‌లో వారం కిందట అనుమానాస్పద స్థితిలో మరణించిన బండి వెంకటయ్యను హత్య చేసినట్లు సిద్దిపేట రూరల్‌సీఐ శ్రీను తెలిపారు. విచారణ అనంతరం శుక్రవారం నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఘణపూర్ గ్రామానికి చెందిన బత్తుల తిరుపతి తన కూతురిపై అదే గ్రామానికి చెందిన మృతుడు బండి వెంకటయ్య బాణామతి చేస్తున్నాడని అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో అతడిని చంపితే రూ.5 లక్షలతోపాటు లావాణి పట్టా భూమి రిజిస్ట్రేషన్ చేయిస్తానని నంగునూరుకు చెందిన అల్లెపు పర్శరాములు, తాళ్లపల్లి సాయిగౌడ్‌తో తిరుపతి ఒప్పందం చేసుకున్నాడు. ఈ విషయం పర్శరాములు తన స్నేహితులు తుపాకుల సాయి, గొడుగు అరవింద్, అల్లేపు రంజిత్‌కు చెప్పడంతో ఒకొక్కరు రూ.లక్ష తీసుకొని వెంకటయ్యను హత్య చేసేందుకు అంగీకరించారు. అడ్వాన్స్ ముట్టడంతో ఈనెల 3వ తేదీన నంగునూరు వచ్చి ఇంటికి వెళ్తున్న వెంకటయ్యను ఘణపూర్ చెక్‌డ్యామ్ వద్ద ఆపి మాట్లాడుతున్నట్లు నటిస్తూ బైక్‌తో ఢీ కొట్టడంతో జేసీబీ గుంతలో పడ్డాడు. పథకం ప్రకారం చంపి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని తెలిపారు. వారిని విచారించగా నేరం అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించామన్నారు.

భూ సమస్య పరిష్కరించండి



సమస్య వివరిస్తున్న నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న తమ వ్యవసాయ భూములు ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో నమోదయ్యాయని, ఆ జాబితా నుంచి వెంటనే తొలగించాలని మంత్రికి తండావాసులు మొరపెట్టుకున్నారు. ఈమేరకు శుక్రవారం మండలంలోని కపూర్‌నాయక్ తండా గ్రామ మాజీ సర్పంచ్ భానోతు సంతోష్‌నాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు భానోతు భాస్కర్‌నాయక్, తండావాసులు హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్య వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కపూర్‌నాయక్ తండా, నందారం గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ 243లో 982 ఎకరాలు ధరణి పోర్టల్ నిషేధిత జాబితాలో ఉందన్నారు. దీంతో సాగు చేసుకుంటున్న తమ భూములు పట్టాలు కావడంలేదని వాపోయారు. రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలు రావడంలేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలనలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలను సైతం బహిష్కరిస్తున్నట్లు ప్రకటించినప్పుడల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చి ఆ తర్వాత విస్మరించారని ఆరోపించారు. గిరిజన కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలో పరిష్కార మార్గాలు చూస్తామని చెప్పినట్లు తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న గిరిజన నాయకులు

హుస్నాబాద్: ఈనెల 15వ తేదీన గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని పురస్కరించుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో వేతనంతో కూడిన సెలవు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేయడంపై గిరిజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వీరన్న నాయక్, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, గిరిజన సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పుష్కరఘాట్ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న జాతర కమిటీ సభ్యులు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలం కూటిగల్‌లో సమ్మక్క-సారలమ్మ గద్దెల సమీప నల్లచెరువు వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఘాట్ నిర్మించనున్నారు. ఈ మేరకు శుక్రవారం జాతర కమిటీ చైర్మన్ కొండూరి శ్రీనివాస్ కమిటీ సభ్యులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుంచి జాతర జరగనుందని, ఇందుకు మద్దూరు జెడ్పీటీసీ సభ్యుడు గిరి కొండల్‌రెడ్డి విడుదల చేసిన రూ.2 లక్షల జెడ్పీటీసీ నిధుల నుంచి పుష్కర ఘాట్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఈనెల 21 నుంచి జరగనున్న జాతరకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాతర కమిటీ ప్రధాన కార్యదర్శి దాచారం బాబు, బండి కృష్ణ, హరిభూషణ్, సిరిమల్ల శ్రీనివాస్, వెంకన్న, బాబు, మాజీ సర్పంచ్ నల్ల మహేందర్, పంచాయతీ కార్యదర్శి అనిత తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు సహకరించాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ లతీఫ్

తొగుట(దుబ్బాక): శాంతి భద్రతలను పరిరక్షించేందుకు ప్రజలు సహకరించాలని తొగుట సీఐ లతీఫ్ కోరారు. సీఐ కార్యాలయంలో తెలంగాణ కల్లుగీత ఉత్పత్తిదారుల సంఘం కేలండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణాగౌడ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సాయికుమార్, మహేష్, నాగార్జున్, షఫీ పాల్గొన్నారు.

11న సూర్యనమస్కారాల పోటీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి సూర్యనమస్కారాల పోటీలు నిర్వహించనున్నట్లు సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్ శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి పోటీలు నిర్వహిస్తామన్నారు.

కోదండరాముడి సన్నిధిలో జాతర

మిరుదొడ్డి(దుబ్బాక): మాఘ అమావాస్య సందర్భంగా మండల పరిధిలోని మిరుదొడ్డి అల్వాల శివారు కూడవెల్లి వాగు ఒడ్డున వెలసిన కోదండరాముడి సన్నిధి శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. వాగులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అల్వాల భక్తులు బండ్ల బోనాలను ఊరేగించారు. కాగా ఇటీవల మల్లన్న సాగర్ నుంచి కూడవెల్లి వాగులోకి సాగు నీటిని వదలడంతో మిరుదొడ్డి శివారు నుంచి అల్వాల అవలి ఒడ్డుకు చేరుకోవడానికి దారి లేక పోవడంతో కొదండరాముడిని దర్శించుకోవడానికి భక్తులకు అవకాశం లేక పోయింది. దీంతో మిరుదొడ్డిలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు మిరుదొడ్డిలోని స్వామివారి విగ్రహాలను కూడవెల్లి వాగు ఇవతల ఒడ్డున తాత్కాలికంగా భక్తుల దర్శనం కోసం ఏర్పాటు చేశారు. కాగా వాగులో స్నానం చేయడానికి వెళ్లిన వ్యక్తి గల్లంతైన విషయం దావానంలా వ్యాపించడంతో జాతరలో విషాదం నెలకొంది.

మానవ వనరుల సమూహం

సిద్దిపేట ఎడ్యుకేషన్: కళాశాలకు ఎన్‌సీసీ గొప్ప మానవ వనరుల సమూహంగా నిలుస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. వివిధ క్యాంపులు, పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థి సాగర్‌ను శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో సుబేదార్ మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వానం శ్రీనివాస్, పరీక్షల అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ పల్లవి, ఎన్‌సీసీ క్యాడెట్‌లు పాల్గొన్నారు.

గురుకులాల భద్రతపై దృష్టి పెట్టాలి

స్వేరోస్ నెట్‌వర్క్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్ని కృష్ణ



మాట్లాడుతున్న స్వేరోస్ నెట్‌వర్క్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్ని కృష్ణ

గజ్వేల్: గురుకుల పాఠశాలల్లో పిల్లల భద్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని స్వేరోస్ నెట్‌వర్క్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్ని కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో వరుసగా ఆత్మహత్యలు, మరణాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. గతంలో గురుకుల విద్యాసంస్థల కార్యదర్శిగా పనిచేసిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కృషితో గురుకుల విద్యాసంస్థలు కార్పొరేట్ విద్యాసంస్థల మాదిరిగా మంచి ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. ఇదే స్ఫూర్తి కొనసాగాలంటే గురుకులాల్లో విద్యార్థుల భద్రతపై దృష్టి పెట్టాలని కోరారు. లేని పక్షంలో స్వేరోస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కార్మికులను హింసించడం అమానుషం

హుస్నాబాద్: పెద్దపల్లి జిల్లా రామగిరి ఖిల్లా సమీప ఇటుక బట్టి కార్మికులను యజమానులు హింసించడం అమానుషమని మానవ హక్కుల వేదిక నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బతుకుదెరువు కోసం తెలంగాణకు వలస వచ్చిన ఒడిశా కార్మికుల బతుకులు చాలా దయనీయంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇటుక బట్టీల్లో వలస కార్మికులపై ఎలాంటి దాడులు జరుగకుండా చూడాలని, లేనిచో చట్టపరమైన చర్యల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. ప్రకటనలో మానవ హక్కుల వేదిక జిల్లా కమిటీ సభ్యుడు ముక్కెర సంపత్ కుమార్, నాయకులు కొయ్యడ కొమురయ్య, బండ సంధ్యారాణి, సాపుల రాజమౌళి, వినోద్ కుమార్ తదితరులు ఉన్నారు.



వినతి పత్రం ఇస్తున్న మల్లేశ్

రేషన్ పంపిణీ చేయాలి

హుస్నాబాద్: మండలంలోని పొట్లపల్లి గ్రామ పంచాయతీ పరిధి దేవేంద్రనగర్ ప్రజలకు స్థానికంగా రేషన్ పంపిణీ చేయాలని ఆర్డీఓ బెన్ షాలెమ్‌కు శుక్రవారం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ వినతి పత్రం ఇచ్చారు. ప్రతీనెల రేషన్ సరుకుల కోసం దేవేంద్రనగర్ నుంచి హుస్నాబాద్, ఆరపల్లె మీదుగా పొట్లపల్లి నుంచి తెచ్చుకునేందుకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చినట్లు మల్లేశ్ తెలిపారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు



మాట్లాడుతున్న సీఐ కిరణ్

హుస్నాబాద్: పిల్లలు కిడ్నాపునకు గురైనట్లు అసత్య ప్రచారాలు, పుకార్లు వదంతులు నమ్మొద్దని సీఐ ఎర్రల కిరణ్ అన్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ గల్లీకి చెందిన మేకల శృతి తన ఇద్దరు పిల్లలతో మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేసింది. కూరగాయలు బరువుగా ఉన్నాయని అక్కడే ఉన్న సుందరగిరి గ్రామానికి చెందిన తెలిసిన వ్యక్తిని పెద్దపాపను ఇంటి వద్ద దింపమని కోరింది. సదరు వ్యక్తి శృతి ఇంటి పక్కనగల మరో ఇంటి వద్ద దించి వెళ్లాడు. దీంతో పాప తల్లి ఆందోళన గురైంది. అక్కడ ఉన్న కొద్ది మంది పాప కిడ్నాపు అయిందని వదంతులు సృష్టించి, వీడియో, ఫొటోలు తీసి సోషల్ మీడియాలో తప్పుగా ప్రచారం చేశారు. కొంత సేపటి తర్వాత పాప ఇంటి వద్దే ఉన్నట్లు తెలుసుకున్నారు. వదంతులు, పుకార్లు సృష్టించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. పిల్లలను అపరిచితులకు అప్పగించొద్దని విజ్ఞప్తి చేశారు.

గావ్ చలో విజయవంతం చేయాలి

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గురువారెడ్డి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

కొండపాక(గజ్వేల్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ చేపట్టిన గావ్ చలో కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గురువారెడ్డి, ఉమ్మడి కొండపాక మండల అధ్యక్షుడు మన్నెం శశిధర్‌రెడ్డి కోరారు. కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి కేటాయించిన నాయకులు గ్రామంలో 24 గంటలు ఉండి గ్రామ స్థితిగతులు, పార్టీతోపాటు ఇతర పార్టీల కార్యకర్తల పరిస్థితులపై అధ్యయనం చేసి పార్టీకి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బడికోలు నర్సింహులు, మాజీ ఉపసర్పంచ్ ఆరె భాస్కర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల కేలండర్ ఆవిష్కరణ



పూల్‌నాయక్ పాఠశాలలో కేలండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

హుస్నాబాద్ రూరల్: హుస్నాబాద్ మండలం పూల్‌నాయక్ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ఫొటోలతో కేలండర్‌ను రూపొందించారు. ఈ కేలండర్‌ను శుక్రవారం మండల నోడల్ అధికారి బండారు మనీల ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఆంగ్ల విద్యాబోధన చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం**

మద్దూరు(హుస్నాబాద్): బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాల ప్రతిఘటనకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపు ఇచ్చారు. ఈ నెల 16న సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టే గ్రామీణ భారత్ బంద్ సమ్మె కరపత్రాలను జాలపల్లి గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై దేశ వ్యాప్తంగా తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌లో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ దూల్మిట్ట మండల కన్వీనర్ పోతిరెడ్డి రాజు, స్వామి, రాజు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **భారత రత్న ప్రకటించడం హర్షణీయం**

గజ్వేల్‌రూరల్: దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించడం హర్షణీయమని గజ్వేల్ బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి బండారు రాంఫణిధర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సరళీకృత ఆర్థిక విధానాలతో దేశాన్ని అగ్రగామిగా నిలిపిన పాలనా సమర్థుడు పీవీ నర్సింహారావు అన్నారు. అలాంటి గొప్ప నేతకు ఆలస్యంగానైనా భారతరత్న రావడం సంతోషకరమని, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. గజ్వేల్‌కు చెందిన రామకోటి రామరాజు పీవీ నర్సింహారావు ఆకృతిని సబ్బు బిళ్లపై చిత్రించి హర్షం వ్యక్తం చేశారు.

◆ **ఆరోపణలు అర్థ రహితం**



తొగుట(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి నిధులు మంజూరు చేయించడం బీఆర్‌ఎస్ నాయకులు భరించలేకపోతున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్కం స్వామి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి రూ.3.33 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దీంతో ఎంపీపీ లతతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. ఎంపీపీతో కలిసి భూమి పూజచేయడం ప్రొటోకాల్ ఉల్లంఘన ఎలా అవుతుందని ప్రశ్నించారు. మెదక్ పార్లమెంట్ సభ్యుడిగా ప్రభాకర్‌రెడ్డి దుబ్బాకకు ఎన్ని నిధులు మంజూరు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ దుబ్బాక నియోజకవర్గ అధ్యక్షుడు బాలమల్లు, మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు శ్రీనాకర్‌రెడ్డి, నాయకులు, ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ **రాష్ట్ర స్థాయిలో రాణించాలి**

సిద్దిపేటజోన్: రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులు రాణించి సిద్దిపేట పేరు నిలపాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం అన్నారు. శుక్రవారం స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తున్న క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రామేశ్వర్ రెడ్డి, వెంకట్ స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **ప్రభుత్వమే బాధ్యత వహించాలి**

బెజ్జంకి(సిద్దిపేట): ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న కరుణాకర్ మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కల్లెపెల్లిలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న కరుణాకర్ ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని స్వాగతిస్తున్నామని, ఆటో డ్రైవర్లకు ఉపాధి భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కచ్చు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **భక్తుల పుణ్యస్నానాలు**



సిద్దిపేటరూరల్: స్వయం భూ లక్ష్మీ నరసింహా స్వామి పుల్లూరు బండ జాతరలో భాగంగా మాఘ అమావాస్యను పురస్కరించుకొని భక్తులు శుక్రవారం కోనేరులో పవిత్ర స్నానాలు చేశారు. మాఘ అమావాస్యనాడు స్వామివారి కోనేటిలో పవిత్ర స్నానాలు చేస్తే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. స్వామివారిని బీజేపీ నాయకుడు దూది శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్యగౌడ్, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

◆ **భవన ప్రారంభోత్సవం విజయవంతం చేద్దాం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హైదరాబాద్ కోకాపేటలో నిర్మించిన దొడ్డి కొమురయ్య భవన్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేద్దామని ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 18న దొడ్డి కొమురయ్య భవనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కోరే ఎల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిందం రాజ మల్లయ్య, జిల్లా యువత అధ్యక్షుడు కోటగిరి ప్రభాకర్, జిల్లా కార్యదర్శి కంతుల రమేష్, పట్టణ అధ్యక్షుడు బైరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.